క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



కె.వెంకటాపురంలో మేలుకొలుపు చేస్తున్న భక్తులు

కోటవురట్ల: మేలుకొలుపుతో పల్లెలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. వేకువజామునే మేలుకొలుపు చేసి భక్తిని చాటుకుంటున్నారు. కె.వెంకటాపురంలో ఆదివారం తెల్లవారుజామున మేలుకొలుపు చేశారు. రామాలయం నుంచి వీధుల్లో తిరుగుతూ సంకీర్తన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పిల్లలు సైతం చలిని కూడా లెక్క చేయకుండా మేలుకొలుపులో పాల్గొని సంకీర్తన చేశారు.

హైందవ శంఖారావానికి తరలిన వీహెచ్‌పీ సభ్యులు



హైందవ శంఖారావానికి వెళ్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

మునగపాక: విజయవాడలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావానికి మండలం నుంచి పలువురు విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) సభ్యులు ప్రత్యేక రైళ్లలో బయలు దేరి వెళ్లారు. రాష్ట్రీయ స్వయం సేవాసేవక్ సభ్యులంతా హైందవ శంఖారావానికి తరలివెళ్లారు. ద్వారపురెడ్డి వాసు, కర్రి వాసు, కర్రి లక్ష్మీనారాయణ, గిన్నె మహేశ్వరరావు, యల్లపు శ్రీనివాస్, తదితరులు విజయవాడ వెళ్లిన వారిలో ఉన్నారు.

రేవుపోలవరం తీరంలో పంపు షెడ్డు తొలగింపు



తొలగించిన పంపు షెడ్డు

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో అనుమతులు లేకుండా సాయి ఆక్వా పరిశ్రమ యాజమాన్యం నిర్మించిన పంపు షెడ్డును ఆదివారం అటవీ శాఖ అధికారులు తొలగించారు. తీరం సమీపంలో గుడివాడ రెవెన్యూలో సాయి ఆక్వా పరిశ్రమ సిబ్బంది సముద్రం నుంచి నీటిని తీసుకునేందుకు పైపులైను ఏర్పాటు చేశారు. తీరం వద్ద పంపు షెడ్డు నిర్మాణం చేశారు. తీరాన్ని ఆనుకుని ఈ ప్రాంతంలో ఇంత వరకు ఎటువంటి నిర్మాణాలు లేవు. స్థానిక వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న ఫిర్యాదుతో యలమంచిలి ఫారెస్ట్ అధికారులు పరిశీలించి పంపు షెడ్డును కూల్చివేశారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



మునగపాక రామాలయంలో భోజనం చేస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక పంచాయతీ వీధిలోని రామాలయంలో ఆదివారం నిర్వహించిన ధనుర్మాస భోజన వసతి సదుపాయానికి విశేష స్పందన లభించింది. ధనుర్మాసంలో భాగంగా గోదాదేవి పూజా కార్యక్రమానికి నిత్యం హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన భోజన వసతిని పలువురు భక్తులు సద్వినియోగం చేసుకున్నారు. వేద పండితులు రేజేటి సత్యనారాయణ, రాంబాబుల సమక్షంలో ఉదయం నుంచి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు ఆడారి లక్ష్మణరావు, పెంటకోట శివాజీ, పూసర్ల వెంకట సత్యనారాయణ, అమ్మ పాల సెంటర్ అధినేత రామజోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగు.. లాభాలు బాగు

రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే విభిన్న మార్గాలను అనుసరించాల్సిందే. సంప్రదాయ పంటలతో గిరిగీసుకుని కూర్చుంటే రైతుకు మిగిలేది అప్పులే. కాలానుగుణంగా మారుతూ ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ అక్కడి పరిస్థితులకు తగ్గట్టుగా పంటల సాగును ఎంచుకోవాలి. మొక్కజొన్న సాగు ఒకప్పుడు చాలా అరుదుగా జరిగేది. కొన్ని ప్రాంతాలకు పరిమితమయ్యేది. వాణిజ్య పంటగా ఎదగడంతో ప్రతీ మండలానికి విస్తరించింది. కొన్ని ప్రాంతాలలో వరితో పాటు మొక్కజొన్న పంట ఎక్కువగా సాగవుతోంది. తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలోనే మంచి ఆదాయాన్ని ఇవ్వడంతో పలువురు రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు.

- తక్కువ పెట్టుబడితోనే చేతికొస్తున్న పంట
- రహదారుల వెంబడి నేరుగా విక్రయాలు
- తప్పిన దళారుల బెడద



ఏపుగా పెరిగిన మొక్కజొన్న

కోటవురట్ల: పాయకరావుపేట నియోజకవర్గంలో సుమారు 120 ఎకరాలలో మొక్కజొన్న సాగులో ఉంది. కోటవురట్ల మండలంలో 40 ఎకరాలలో సాగవుతుండగా కోటవురట్ల, రాజుపేట, గవరపేట, జల్లూరు, లింగాపురం, యండపల్లి, చినబొడ్డేపల్లి, కొడవటిపూడి ప్రాంతాలలో ఎక్కువగా ఉంది. ఇందులో 20 ఎకరాల్లో స్వీట్ కార్న్ మొక్కజొన్న పండిస్తున్నారు. జల్లూరు ప్రాంతంలో ఏడాది పొడవునా పండిస్తూ రహదారుల వెంబడి విక్రయాలు చేపడుతున్నారు. రైతులే నేరుగా దుకాణాలు పెట్టడడంతో దళారుల బెడద లేకుండా అధిక లాభాలు వస్తున్నాయి. ఇది పర్యాటక ప్రాంతాలలో కాలక్షేపం తినుబండారంగానే కాకుండా పశువులకు దాణాగా కూడా పనికొస్తోంది. చాలా పరిశ్రమల్లో ముడి సరకుగా, తినుబండారాలు పేలాలు, తీపికండె, కాయగూరల రకంగా వినియోగిస్తున్నారు. వాడకం బాగా పెరగడంతో ఏటా సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది.

మొక్కజొన్న రకాలు

మొక్కజొన్నలో మూడు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక(100-120 రోజులు), మధ్యకాలిక(90-100 రోజులు), స్వల్పకాలిక(90 రోజుల లోపు) పంటలు ఉన్నాయి. ఇందులో దీర్ఘ కాలిక, మధ్యకాలిక పంటలు అధిక దిగుబడిని ఇస్తుండడంతో ఎక్కువగా రైతులు వీటి సాగుకే మొగ్గు చూపుతున్నారు.

ఎరువుల యాజమాన్యం

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని, మరోసారి 30-35 రోజుల సమయంలో మూడో వంతు నత్రజని, 50-55 రోజుల మధ్య మరోసారి మూడో వంతు నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును, సగం పొటాష్ ఎరువును వేయాలి. మిగతా సగం పొటాష్‌ను పూత దశలో వేసుకోవాలి. నీటి పారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని, 25-30 రోజుల సమయంలో మరోసారి నాలుగో వంతు నత్రజని, 45-50 రోజుల మధ్య నాలుగో వంతు నత్రజని, చివరగా 60-65 రోజుల మధ్యకాలంలో నాలుగో వంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటల కొకసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉన్నట్టయితే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే ఎరువులు వేయాలి.

సాగు పద్ధతులు

పంట భూమిని విత్తే ముందు నాగలితో మూడు, నాలుగుసార్లు దుక్కి దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు సుమారు 10 టన్నుల బాగా మాగిన పశువుల గెత్తాన్ని వేయాలి. తరువాత నాగలితో బోదె, కాలువలు చేసుకోవాలి. విత్తే ముందు నాగలితో బోదె తయారు చేసుకోవాలి. బోదెకు పైనుంచి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీని వల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనప్పుడు నీరు బయటకు పోయేందుకు వీలు కలుగుతుంది. మొలకెత్తిన పది రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట బలంగా ఉన్న ఒక్కొక్క మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను పీకివేయాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు.

ఏడాది పొడవునా బేరాలు

నర్సీపట్నం-రేవుపోలవరం రహదారిలో మొక్కజొన్న అమ్మకాలు బాగున్నాయి. జల్లూరు, యండపల్లి ప్రాంతంలో చాలా మంది రైతులు ఏడాది పొడవునా సాగుచేస్తున్నారు. నేరుగా మేమే దుకాణాలు పెట్టి విక్రయిస్తాం. దాంతో రవాణా ఖర్చులు, ఆశీల బాధ లేకుండా నేరుగా లాభాలు వస్తున్నాయి.

– నూకరత్నం, రైతు, జల్లూరు

అంతర కృషి ఉండాలి



అంతర కృషి చేయడం వల్ల పంటలో దిగుబడి బాగుంటుంది. విత్తిన 30 రోజులకు పశువులతో లేదా, ట్రాక్టరుతో అంతర కృషి చేస్తే కలుపు మొక్కలను నివారించవచ్చు. తరువాత నత్రజని ఎరువులను వేసి వెంటనే బోదె నాగలిని నడిపితే కలుపు మొక్కల నివారణతో పాటు వేసిన ఎరువు పంట పెరుగుదలకు దోహదపడుతుంది.

– బి.సరోజిని, కోటవురట్ల మండల వ్యవసాయాధికారి

లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిత



విద్యార్థినులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మునగపాక: విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ ఆకాంక్షించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 17 మంది విద్యార్థినులకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.70 వేల మేర ఉపాకర వేతన పంపిణీ కార్యక్రమం ఆదివారం మునగపాక హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువుకునేందుకు సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ప్రవాస భారతీయురాలు ఆడారి పావని మూర్తి మాట్లాడుతూ చదువులో ఏకాగ్రతతో పాటు దృఢ సంకల్పం ఉండాలన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు శిష్టా తమ్మిరాజు, సంస్థ సభ్యులు కేవీ రమణ, ఆచంట నాగేశ్వరరావు, డి.సూరేష్, ఎస్.రమేష్, మాడెం జోగారావు, పిల్లా జగదీష్ ఏవీఎస్ మూర్తి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నేటికీ అందని జీతాలు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా ఉపాధ్యాయులకు 1వ తేదీనే జీతాలు వేస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది జూన్‌లో మాత్రమే 1వ తేదీన జీతాలు వేశారని, తర్వాతి నెల నుంచి జీతాలు సరిగ్గా వేయడం లేదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీతాలు లేక ఉపాధ్యాయులు ఈఎంఐలు, కరెంట్ బిల్లులు చెల్లించలేకపోతున్నారని అన్నారు. అపరాధ రుసుంతో చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, పిల్లల ఫీజులు కట్టేందుకు అప్పులు చేయాల్సి వస్తుందన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన



టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన లభించింది. యలమంచిలి, రాంబిల్లి మండలాల్లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్ల నుంచి సుమారు 800 మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ కోసం 13 గదులను కేటాయించారు. డిగ్రీ, బీఈడీ కళాశాలల విద్యార్థులు ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు. పరీక్ష నిర్వహణకు ముందు టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మామిడి రమణ, కొత్తపేట పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.సుధారాణి విడుదల చేశారు. వచ్చే మార్చిలో జరగబోయే 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల్లో భయాందోళనలను పోగొట్టి వారిలో ప్రతిభను వెలికి తీసేందుకే ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు రమణ తెలిపారు. మొత్తం 100 మార్కులకు మల్టీపుల్ ఛాయిస్ విధానంలో 100 ప్రశ్నలు ఇచ్చారు. జవాబు పత్రాల మూల్యాంకనం అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి బాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ యలమంచిలి మండల అధ్యక్ష, కార్యదర్శులు అభి, మణికంఠ, డివిజన్ నాయకులు రామలక్ష్మణులు, శ్రీను, కృప, రాఘవేంద్ర, సునీల్, ధర్మరాజు, రాజేష్, శరణ్య, జాను, హేమ, సత్య, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి నేత్ర వైద్య పరీక్షలు



సిబ్బందికి నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి కంటి పరీక్షలు చేయగా.. 24 మందికి కళ్లద్దాలు అందజేశారు. 144 మందికి మందులు పంపిణీ చేశారు. 26 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఇది 134వ వైద్య శిబిరమని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు.

జోరుగా వరి నూర్పులు



యండపల్లిలో యంత్రంతో వరి నూర్పు చేస్తున్న రైతులు

కోటవురట్ల: ఖరీఫ్ కష్టాల నుంచి అన్నదాత తేరుకునే ప్రయత్నం చేస్తున్నాడు. వరుస తుపానులు అన్నదాత కంటిమీద కునుకులేకుండా చేశాయి. వరి కోతలు చేపట్టే దశలో వాయుగుండం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో మండలంలో 4 వేల ఎకరాలలో వరి సాగు జరిగింది. అంతా బాగుంది ఇక కోతలు మొదలెట్టి ధాన్యపు గింజలను ఇంటికి చేర్చుకుందామనుకున్న సమయంలో వరుణుడు అనుకోని అతిథిలా పలకరించాడు. చాలా చోట్ల వరి పనలు నీట మునిగి ధాన్యం రంగు మారిపోయింది. మరికొన్ని చోట్ల పనలు నేలవాలి గింజరాలిపోయి నష్టం కలిగింది. మిగిలిన రైతులు ఉన్న గింజలను ఇంటికి తీసుకెళ్లాలన్న తపనతో జోరుగా వరి నూర్పులు చేస్తున్నారు. ప్రస్తుతం యండపల్లి, జల్లూరు, బి.కె.పల్లి, కోటవురట్ల, తంగేడు, లింగాపురం, పాములవాక తదితర ప్రాంతాలలో వరి నూర్పులు చురుగ్గా సాగుతున్నాయి. కూలీల కొరతను అధిగమించేందుకు పలువురు రైతులు నూర్పుడు యంత్రాలను వినియోగిస్తున్నారు. ఇవి అద్దెకు దొరుకుతుండడంతో కాస్త ఖర్చు అయినా శ్రమ తగ్గుతోందని రైతులంటున్నారు. నూర్పుడు యంత్రాలను గంటకు రూ.1100 చొప్పున అద్దెకు ఇస్తున్నారు. దాంతో పలువురు రైతులు వీటిపైనే ఆసక్తి చూపిస్తున్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ



వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న భక్తులు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించే ఆలయంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులవుతున్నారు. ఆదివారం ఆస్ట్రేలియాలో ఉంటున్న మల్కాపురం వాసులు యల్లపు ముకుందరావు-కల్యాణి దంపతులు రూ.1,11,111 విరాళం అందజేశారు. అనకాపల్లికి చెందిన దాడి రామలక్ష్మి, శర్వాణిలు రూ.11,111, మునగపాకకు చెందిన బుద్ద శ్రీనివాసరావు-జగదీశ్వరి దంపతులు రూ.5,116 నగదును విరాళంగా ఆలయ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ పెద్దలు సూరిశెట్టి రాము, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి కృష్ణ, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట ఉమేష్, పొలిమేర కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, వేగి కృష్ణ, కిష్టప్ప, వెలగా శ్రీనివాసరావు, అడారి రమణబాబు, వెలగా సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుణ్యకోటి వాహనంపై పరంధాముడు



పుణ్యకోటి వాహనంపై స్వామి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారి మూలవిరాట్ సన్నిధిలోను, ఉత్సవమూర్తులు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో నిత్య పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పుణ్యకోటి వాహనంపై శ్రీదేవీ భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామిని, పల్లకిలో గోదాదేవి అమ్మవారిని ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థగోష్టి, ప్రసాద వినియోగం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు ప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు



స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

యలమంచిలి రూరల్: ఉచిత వైద్య శిబిరాలతో నిరుపేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రాపేటి సంతోష్(కొత్తపాలెం) అభిప్రాయపడ్డారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ వద్ద క్రైడాస్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా భావంతో ఏర్పాటు చేస్తున్న ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 250 మందికి ఉచితంగా బీపీ, బ్లడ్ షుగర్, ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యురాలు పి.మజ్జి సుభాన్‌బీ, క్రైడాస్ ఫార్మసీ సీఈవో జి.బాలాజీ, డిస్ట్రిబ్యూటర్, జీఎస్‌ఆర్ మూర్తి, వైద్య సిబ్బంది రాము, లోవమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు



తిమ్మరాజుపేట గ్రామాభ్యుదయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావును సత్కరిస్తున్న సభ్యులు



గంగాలమ్మతల్లి గుడి ప్రాంగణంలో తోటాడ పంచాయతీ పాలకవర్గ సభ్యుల కుటుంబాలు

మునగపాక: వాడ్రాపల్లిలో ఆదివారం తిమ్మరాజుపేట గ్రామాభ్యుదయ కమిటీ సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కమిటీ సభ్యులంతా ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు భీమరశెట్టి శ్రీనివాసరావు, బీవీ లక్ష్మణరావు, డాక్టర్ భాస్కరరావు, శ్రీరామమూర్తి, నాయుడు, డాక్టర్ ప్రసాద్‌లను సత్కరించారు. గ్రామాభివృద్ధికి సహకారం అందించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని నిర్ణయించారు.

- తోటాడ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తమ కుటుంబాలతో ఆదివారం మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడి ప్రాంగణంలో సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత దొడ్డి కోటేశ్వరరావు, ఇతర పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని రాజుపేటలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్షేమ బోర్డుతోనే కార్మికులకు మేలు



మాట్లాడుతున్న లక్ష్మయ్య

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రోడ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు, కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయని ఆల్ ఇండియా రోడ్ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సదస్సులో ఆయన మాట్లాడారు. డీజిల్ రేట్ల పెంపుదల వల్ల రవాణా రంగ కార్మికులు ఆదాయం కోల్పోయారన్నారు. ఏడాదికి రూ.7 లక్షల వరకు ఒక్కో కార్మికుడి నుంచి ప్రభుత్వాలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తున్న వారికి సంక్షేమ బోర్డు ద్వారా సహకారం అందించాలని కోరారు. కేరళ రాష్ట్రంలా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రభుత్వాలే నిర్వహించాలన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ అద్దె బస్సుల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర నాయకుడు వి.తులసీరామ్ మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న హైర్‌బస్ డ్రైవర్లకు అత్యల్ప జీతాలు ఇచ్చి ఇటు ప్రభుత్వం, అటు ఓనర్లు దోపిడీకి పాల్పడుతున్నారని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా జి.దేముడిని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. మరో 15 మంది జిల్లా కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఆర్టీసీ హైర్‌బస్ డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, ఏపీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జిల్లా కార్యదర్శి పీఎస్‌వీ పరమేశ్వరరావు, నాయకులు వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి

అనకాపల్లి: వృద్ధులు ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు అన్నారు. స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాల్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్య కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్లు అందజేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులకు నెలకు రూ. 6 వేలు పింఛన్ చెల్లించాలని కోరారు. వృద్ధులు సమావేశాలు నిర్వహించుకునేందుకు పట్టణ పరిధిలో ఒక భవనాన్ని ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరు పైడారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, అన్ని ప్రభుత్వ శాఖల్లో వృద్ధులకు ప్రత్యేక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆడారి అప్పారావు, జి.సాంబవిరాజు, బుద్ద తాతారావు, వి.సత్యనారాయణ, కె.త్రినాథ్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే బీసీ కులాల అభివృద్ధి



మాట్లాడుతున్న అంగడాల పూర్ణచంద్రరావు

అనకాపల్లి: కుల గణన ద్వారానే బీసీల అభివృద్ధి జరుగుతుందని బీసీ కులాల సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో ఆదివారం బీసీ కులాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా పొందుతున్న రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో బీసీలకు దక్కాలంటే బీసీ కులాల విభజన జరగాలని కోరారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో బీసీ కులాలు తీవ్రంగా వెనుకబాటుకు గురవుతున్నాయని, బీసీలంతా ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.సి. రమణ మాట్లాడుతూ బీసీలు తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కో-కన్వీనర్ కె.శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే బీసీలు పూర్తిగా వెనుకబడిపోయారని, రాజకీయంగా బీసీలకు దక్కవలసినవి దక్కలేదన్నారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, గుడాల సత్యనారాయణ, బొట్టా చిన్నయాదవ్, కోన లక్ష్మణ్, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బొబ్బిలి గోవిందరావు, వాసుపల్లి తాతయ్యలు, ఎస్.వి.వి.రామచంద్రరావు, సూదికొండ మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.